క్లుప్తంగా

ఘనంగా భూతప్పస్వామి ఉత్సవం

రొళ్ల: మండల పరిధిలోని కాకిగొల్లహట్టి గ్రామంలో యాదవ కులస్తుల ఆరాధ్య దేవుడు భూతప్పస్వామి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పిల్లిగుండ్లగొల్లహట్టిలో వెలసిన భూతప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఒకరోజు ముందుగానే యాదవ కులస్తులు మేళతాళాలతో ఊరేగింపుగా కాకిగొల్లహట్టి గ్రామానికి తీసుకువచ్చి పట్టం కూర్చోబెట్టారు. ప్రతి ఇంటి నుంచి జ్యోతులతో హాజరై స్వామి వారికి సమర్పించారు. తర్వాత భూతప్ప స్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఉత్సవ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు హాజరయ్యారు. మాజీ సర్పంచ్ సిద్ధప్ప, ఎంపీటీసీ భర్త యర్రగుంటప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు నగేష్‌రంగారెడ్డి, మంజునాథ్, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బలిజల వివాహ పరిచయ వేదిక



కైవారం తాతయ్య చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

హిందూపురం: కులంపట్ల ఆప్యాయత అభిమానం కలిగి ఉండాలని రాష్ట్ర బలిజ వివాహ పరిచయ వేదిక నిర్వాహకుడు జీవీఆర్ రమణ తెలిపారు. హిందూపురం బలిజ సేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక కేవీఆర్ ఫంక్షన్ హాల్ ఆదివారం బలిజల వివాహ పరిచయవేదిక జరిగింది. ముందుగా కైవారం తాతయ్య చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివాహ పరిచయ వేదిక కార్యక్రమం జరిగింది. హిందూపురం బలిజ సేవా సంఘం నాయకులు రాయల్ గోపాల్, రాజ్యలక్ష్మిమోహన్, కైవారం తాతయ్య ట్రస్టు అధ్యక్షుడు రవి, నాగరాజు, వెంకటరాముడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సీహెచ్ ఆనంద్‌కుమార్

చిలమత్తూరు: మండల పరిదిలోని చెరువు ముందరపల్లికి చెందిన కళాకారుడు సీహెచ్ ఆనంద్‌కుమార్ ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. డ్రామాల్లో హార్మోనిస్ట్‌గా ఆయన ప్రతిభ చాటారు. మన రాష్ట్రంతో పాటు కర్ణాటకలోనూ తన కళను ప్రదర్శిస్తూ మన్ననలు పొందారు. హార్మోనియంతో పాటు ప్రజలను ఉద్యమాల వైపు ఆకర్షితులు చేసిన ఘనత కూడా ఉండటంతో ఆయన కళను గుర్తించిన తమిళనాడుకు చెందిన కల్చరల్ యూనివర్సిటీ డాక్టరేట్‌తో సత్కరించింది. శనివారం హొసూరులో జరిగిన డాక్టరేట్ ప్రదానోత్సవ కార్యక్రమంలో డ్రామా ఆర్టిస్ట్ మ్యూజీషియన్ (హార్మోనియం) సంగీత విద్వాన్ విభాగంలో డాక్టరేట్‌ను అందించారు. అలాగే సోషల్ సర్వీస్ అండ్ డెడికేషన్ అవార్డును కూడా అందజేశారు.

ప్రశాంతంగా మహా గణపతి నిమజ్జనం



వినాయక విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక వినాయకనగర్‌లోని యోగి నారాయణస్వామి దేవాలయంలో ప్రతిష్ఠించిన మహా గణపతిని ఆదివారం సాయంత్రం నిమజ్జనం చేశారు. 16 రోజుల పాటు గణపతికి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఊరేగింపులో డప్పు శబ్దాలకు యువత నృత్యాలు చేశారు. అంతకు ముందు నిర్వహించిన 15 కేజీల లడ్డు ప్రసాదాన్ని వేలంలో ఎస్ఎస్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వినయ్ బాబు రూ.62 వేలకు దక్కించుకున్నారు.

జూదరుల అరెస్ట్



జూదరుల అరెస్టు చూపుతున్న పోలీసులు

మడకశిర: మండలంలోని జిల్లేడుగుంట వద్ద ఆదివారం జూద కేంద్రంపై దాడి చేసినట్లు మడకశిర టౌన్ సీఐ రామారావు తెలిపారు. జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ. 26,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే విధంగా జూదరులకు సంబంధించిన ఏడు ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లను కూడా సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడా జూదం ఆడుతున్నట్లు తెలిసే ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకారం అందించాలని కోరారు.

దంచికొట్టిన వర్షం



పాపిరెడ్డిపల్లి చెరువు మరువ పారుతున్న దృశ్యం



హిందూపురం: ముక్కిడిపేటలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు



మడకశిర మండలం గౌడనహళ్లిలో పిడుగు పడటంతో దెబ్బతిన్న చెట్టు

సాక్షినెట్‌వర్క్: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో పలు ప్రాంతాల్లో ఆదివారం వర్షం దంచి కొట్టింది. గోరంట్ల మండలంలో తెల్లవారుజామున 5 నుంచి 8 గంటల వరకూ ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గోరంట్లలోని ఓ విల్లా సమీపంలో పిడుగు పడటంతో పలువురి ఇళ్లలోని ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయి. గుడిబండ మండల వ్యాప్తంగా పలుచోట్ల ఆదివారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు మోస్తారు వర్షం కురిసింది. మడకశిర మండలంలో ఆదివారం తెల్లవారుజామున గంటకు పైగా మోస్తరు వర్షం పడింది. మడకశిరలో 6 మి.మీ., అమరాపురం 19.4, గుడిబండ 5.2, రొళ్ల 4.6, అగళి 8.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. సోమందేపల్లి మండలం కేతగాని చెరువు గ్రామంలోని ఎస్సీ కాలనీలో వర్షపు నీరు ఇళ్లలోకి ప్రవహించడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. చిలమత్తూరులోనూ భారీ వర్షం కురిసింది. 26.2 మి.మీ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా కురిసిన వర్షానికి పలు చెరువు, కుంటల్లోకి నీళ్లు చేరాయి. హిందూపురంలో తెల్లవారుఝాము నుంచి ఉదయం 9 గంటల వర్షం దంచి కొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి.



సోమందేపల్లి మండలం కేతగానిచెరువు గ్రామంలో జలమయమైన ఎస్సీ కాలనీ



చిలమత్తూరులో పంచాయతీ కార్యాలయం వద్ద నిలిచిన వర్షపు నీరు



గోరంట్ల మండలం పాలసముద్రం చెరువు మరువ పారుతున్న దృశ్యం



హిందూపురం: దుకాణాల వద్ద నిలిచి ఉన్న వర్షపునీరు



భారీ వర్షానికి గోరంట్లలో జలమయమైన ప్రధాన రహదారి



గుడిబండ మండలం ఫళారంలో కురుస్తున్న వర్షం



హిందూపురంలోని హస్నాబాద్ ప్రాంతంలో ఇళ్లలోకి వెళ్లిన నీరు

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో అక్టోబర్ 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆధ్వర్యంలో జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాదేవిని రోజుకో రూపంలో అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. 3న బాలత్రిపుర సుందరి, 4న గాయిత్రి, 5న అన్నపూర్ణేశ్వరిదేవి, 6న లలితాదేవి , 7న మహాలక్ష్మి , 8న రాజరాజేశ్వరి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహాచండి, 12న మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు దర్శనం ఇస్తారన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి

లేపాక్షి: వీరభద్రస్వామి దేవాలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ జరిగే శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆదివారం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేలా భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఉత్సవాల నేపథ్యంలో ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నామన్నారు



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

సీతారాం ఏచూరికి ఘన నివాళి

హిందూపురం టౌన్: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, దివంగత సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఆదివారం జరిగింది. సభకు సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ముందు సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, సీడబ్ల్యూసీ మెంబర్, మాజీ మంత్రి రఘువీర మాట్లాడుతూ జీవితంలో ఎన్నో పదవులు అనుభవించడానికి అవకాశం ఉన్నప్పటికీ సీతారాం ఏచూరి పదవులపైన ఏనాడు మక్కువ చూపలేదన్నారు. ఆయన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినా కులాలు, మతాలకు అతీతంగా కమ్యూనిస్టు నిబద్ధతతో చివరి వరకూ జీవించారని కొనియాడారు. యూపీఏ ప్రభుత్వంలో ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం రావడంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు. అలాగే ఈమధ్య కాలంలో ఇండియా కూటమి ఏర్పడటంలోనూ ఆయన పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, వైఎస్సార్ సీపీ నాయకులు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, సీపీఎం పార్టీ కార్యవర్గ సభ్యులు బడా సుబ్బారెడ్డి, ఈఎస్ వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు జడ్పీ శ్రీనివాసులు, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ దిల్షాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేటి శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి రఘువీర

‘పురం’లో లలిత కళల పరీక్ష

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో చండీగర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో భరతనాట్యం, కూచిపూడి, కథకళి, ఫైన్‌ఆర్ట్స్‌కు సంబంధించిన పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఈఓ గంగప్ప, ఎంజీఎం పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం, నాట్య గురువు సుధా స్రవంతి, చంద్రభాను చతుర్వేది పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన జ్యోతిశేఖర్ ఇన్విజిలేటర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ చండీఘర్ యూనివర్సిటీ రెండు తెలుగు రాష్ట్రాలలో దాదాపు 30 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తుండగా, ఈసారి హిందూపురంలో కూడా ఈ పరీక్ష నిర్వహించారన్నారు. ఇందులో 9 గ్రేడ్లు ఉంటాయని తెలిపారు. లలిత కళలను మధ్యలోనే ఆపివేయకుండా చివరిదాకా పిల్లలకు నేర్పించే బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులదేనన్నారు. కళా నిలయమైన హిందూపురంలో ఈ పరీక్ష నిర్వహించడం చాలా అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. గతంలో పరీక్షకు హాజరు కావాలంటే హైదరాబాద్, విజయవాడ, ముంబై లకు వెళ్లాల్సి వచ్చేందని, అలాంటి కేంద్రాన్ని అభిజ్ఞానృత్యాలయం గురువు చంద్రభాను చతుర్వేది హిందూపురానికి తీసురావడానికి కృషి చేయడం హర్షణీయమన్నారు.



లలిత కళల పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థినులు, నాట్యకారులు

మళ్లీ తెరపైకి మోటర్ల మరమ్మతు !

- గొల్లపల్లి రిజర్వాయర్, మూడు పంపింగ్ కేంద్రాలను కమిషనర్‌కు చూపించిన అధికారులు
- జేబులు నింపుకునేందుకేనంటున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

హిందూపురం: హిందూపురం కొత్త కమిషనర్ శ్రీనివాసులును ఆదివారం మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తాగునీటి పంపింగ్ సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హిందూపురం పట్టణానికి తాగునీటి సరఫరా చేసే గొల్లపల్లి రిజర్వాయర్, మూడు పంపింగ్ కేంద్రాల పరిస్థితులను తెలుసుకున్నారు. హిందూపురం నుంచి వీకే తండా, ఎస్‌కేడీ, గొల్లపల్లి రిజర్వాయర్లలోని ప్యానల్‌బోర్డులు, మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, రియర్వాయర్ కేంద్రాలను చూపించారు. ఈ ఏడాది ఆగస్టులో కౌన్సిల్ సమావేశంలో మోటర్లు తదితరాల మరమ్మతుకు రూ.1.50 కోట్లు కేటాయించి పనులు చేయడానికి ప్రయత్నించగా కౌన్సిల్ సభ్యులు అభ్యంతరం తెలిపారన్నారు. ఈసారి జరిగే కౌన్సిల్‌లో పనులు చేయడానికి ఆమోదం తీసుకోవాల్సి ఉందని కమిషనర్‌కు అధికారులు తెలిపారు. కలెక్టర్ విడుదల చేసిన డ్రాట్‌ఫండ్స్‌లో తిరిగి ఆవే పనులు చేయడానికి ఇంజనీరింగ్ అధికారులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇందులో భాగంగా కొత్త కమిషనర్‌ను తాగునీటి పంపింగ్ వ్యవస్థను చూపించి చేపట్టే పనులు వివరించారు. మరమ్మతుల పేరిట చేస్తున్న పనుల్లో పెద్ద అవినీతి దాగి ఉందని గతంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నిరసన తెలియజేసిన విషయం తెలిసిందే. పనుల పేరుతో జేబులు నింపుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు చెబుతున్నారు.



హెవీ మోటర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. సమస్యలు ఏమైనా ఉంటే ప్రజలు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో అర్జీల ద్వారా తెలపాలన్నారు. మండలస్థాయి అధికారులు కార్యక్రమానికి కచ్చితంగా హాజరు కావాలని కోరారు.

పూజలు విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: తిరుమల లడ్డూ విశిష్టత, పవిత్రతను మంటగలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు పాపాన్ని పక్షాళన చేయడానికి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు నియోజకవర్గవ్యాప్తంగా శనివారం ఆలయాల్లో పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ పూజలతోనైనా చంద్రబాబు తన వక్ర బుద్ధిని మార్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ఈపాపానికి శిక్ష అనుభవించడం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు చేస్తున్న నీచాతినీచమైన రాజకీయాలను చూసి సిగ్గు పడుతున్నారన్నారు.

సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

అమరాపురం: మండల పరిధిలోని హేమావతిలో వెలసిన సిద్దేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు ప్రసాద వినియోగం చేశారు. జిల్లా నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించారు.

పొంచి ఉన్న ప్రమాదం

రొద్దం: మండల కేంద్రంలోని హిందూపురం-కలిపి ప్రధాన రహదారి పక్కన ఫ్లోర్‌మిల్ వద్ద విద్యుత్ స్తంభం కూలడానికి సిద్ధంగా ఉంది. విద్యుత్ స్తంభం అడుగు భాగాన విరిగి పోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులకు, ట్రాన్స్‌కో ఏఈకి విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. విద్యుత్ స్తంభం అడుగు భాగాన పూర్తి దెబ్బతిందని, అది ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రజల ప్రాణాలు పోతేగాని అధికారులు స్పందించరా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- డీఎస్పీ మహేష్



హిందూపురం అర్బన్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోనే సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హిందూపురం డీఎస్పీ కేవీ మహేష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందూపురం సబ్ డివిజన్‌లో ఏ సమస్యలు ఉన్నా ప్రజలు నేరుగా తమను కలవవచ్చన్నారు. హిందూపురం వన్‌టౌన్, టూటౌన్, అప్‌గ్రేడ్, హిందూపురం రూరల్ సర్కిల్ పరిధిలో ప్రజలు తమ వినతులు సంబంధించి సిఐలు, ఎస్ఐలకు అందజేస్తే వెంటనే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. నేరుగా ఫిర్యాదు చేయలేని వారు సెల్‌ఫోన్ ద్వారా 9281107076 సంప్రదించవచ్చన్నారు.

శాంతిభద్రతలను పరిరక్షించండి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను ఆయన పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి ఎస్ఐ రమేష్ బాబుతో ఆరా తీశారు. మండలంలో పేకాట, మట్కా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్ఐకి వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా రాజీపడకుండా పని చేయాలన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ వీరేష్

అగళి: మండల కేంద్రంలోని మడకశిర రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం ఎస్ఐ వీరేష్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించారు. అనుమతి లేకుండా తిరుగుతున్న వాహనాలు, నంబర్ ప్లేట్ వాహనాలను గుర్తించారు. ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. నిబంధనలను అతిక్రమించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వీరేష్ తెలిపారు.

మామిడి మొక్కల పంపిణీ



అమరాపురం: మండలంలోని రైతులు బోరు బావుల కింద పండ్ల తోటలు పెంపకం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఏపీఓ జగదీష్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని 27 మంది చిన్న సన్నకారు రైతులకు 4,954 మొక్కలను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీఏ.హనుమంతరాయ, ఎఫ్ఏలు, రైతులు పాల్గొన్నారు.